క్లుప్తంగా

సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పర్వతగిరి: మండలంలోని వడ్లకొండలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ, హోమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఆమడగాని రాజు, దుర్గారావు, వేల్పుల శ్రీనివాస్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సఖీ సేవలపై అవగాహన అవసరం

దుగ్గొండి: మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం ప్రతినిధులు తిరుమల, స్వప్న అన్నారు. మండలంలోని తిమ్మంపేట గ్రామంలో డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలకు సఖీ సేవలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు సఖీ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాల బాధ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

నెక్కొండ: తెగిపడిన విద్యుత్ తీగ తగిలి పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని తోపనపల్లి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన బాధిత రైతు కాగితోజు విజేందర్ మాట్లాడుతూ.. రోజు మాదిరిగానే తన వ్యవసాయ బావి వద్దకు మేత కోసం గేదెను తీసుకెళ్లినట్లు తెలిపారు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మార్గమధ్యలో విద్యుత్ తీగ తెగిపడి ఉంది. అటుగా వచ్చిన గేదె తీగకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. దీంతో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని రైతు కోరారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి



సంగెం: భూమి కోసం, భుక్తికోసం దొరలకు, జాగీర్దారులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అమరులైన వీరుల వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కుంటపల్లిలో నిర్వహించిన ఎంసీపీఐయూ వరంగల్ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24 నుంచి మే1వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. ఈ నెల 19వ తేదీన రాయపర్తి మండలం కొత్తూరులో ఎంసీపీఐయూ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ మరణించిన మహ్మద్ గౌస్ 4వ వర్ధంతి సభను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుమారస్వామి, మంద రవి, బండి బుచ్చయ్య, కన్నం సంధ్య, ఇస్మాయిల్, సురేష్, రవి, సాంబయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట: దండకారణ్యంలో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ప్రజాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యంలో ఆదివాసి ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అడవిని, అడవిలో ఉన్న సహజ సంపదను, ఖనిజ సంపద వనరులను కాపాడుకునేందుకు పోరాడుతున్న ఆదివాసీ సంఘాలను నిషేధించి ఆ సంఘ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని పేర్కొన్నారు.

'పంట కోతలు వాయిదా వేసుకోండి'

దుగ్గొండి: మండలంలో మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి, మొక్కజొన్న, మిరప పంట కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా పంట ఉత్పత్తులు దెబ్బతినకుండా తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట చేలలో ఉన్న పంట ఉత్పత్తులను టార్పాలిన్ షీట్లతో జాగ్రత్తగా కప్పి కాపాడుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలెన్నో..!



పెద్దకొర్పోలులో వైకుంఠధామం ప్రవేశ ద్వారాన్ని కమ్మేసిన ముళ్లచెట్లు



పెద్దకొర్పోలులో వసతుల లేమితో ఉన్న వైకుంఠధామం

- శ్మశానవాటిల్లో కరువైన వసతులు
- పలు గ్రామాల్లో నిరుపయోగమే..
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

నెక్కొండ: ఆఖరు మజిలీకి అవస్థలు తప్పడంలేదు. దుఃఖాన్ని దిగమింగుకొని అంత్యక్రియలు నిర్వహించేందుకు వైకుంఠధామానికి వెళ్తున్న కుటుంబ సభ్యులను అక్కడి అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. కనీస వసతులు కరువై ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండలంలోని శ్మశాన వాటికల్లో విద్యుత్, నీరు, రహదారి, మరుగుదొడ్లు వంటి వసతులు లేక ఆఖరి మజిలీలో అవస్థలు తప్పడంలేదని ప్రజలు



బంజరుపల్లిలో దారి లేని వైకుంఠధామం

వాపోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో పంచాయతీరాజ్ శాఖ నుంచి వైకుంఠధామాలు నిర్మించారు. ఇందుకోసం ఒక్కో శ్మశానవాటిక నిర్మాణానికి రూ.12.60 లక్షలు ఖర్చు చేశారు. కానీ, అవి ఎంత నాణ్యతతో నిర్మించారనేది పర్యవేక్షించలేదనే ఆరోపణలు మొదటినుంచి ఉన్నాయి. ఏదోలా నిర్మాణాలు పూర్తయినా.. నిర్వహణ కొరవడి పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. కొన్ని గ్రామాలకు వైకుంఠదామాలు చాలా దూరంగా ఉన్నాయి. దీనికి తోడు వసతులు లేక ఇక్కట్లు తప్పడంలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వైకుంఠధామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులతోపాటు వసతులపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

వైకుంఠధామానికి దారిలేదు..



బంజరుపల్లి గ్రామంలోని వైకుఠధామానికి దారిలేదు. గ్రామానికి దూరంగా ఉండడంతోపాటు వైకుంఠధామానికి వెళ్లాలంటే పొలం గట్టుపై నుంచి వెళ్లాలి. విద్యుత్ సౌకర్యం లేదు. అధికారులు స్పందించి దారితోపాటు ప్రహరీ నిర్మించాలి.

- ఎరుకల రాజు, గ్రామస్తుడు, బంజరుపల్లి

నిరుపయోగంగా ఉంది..



రూ.లక్షలు వచ్చించి వైకుంఠధామం నిర్మించారు. కానీ, నిరుపయోగంగా మారింది. అంత్యక్రియలకు ఎవరు వెళ్లకపోవడంతో ముళ్ల పొదలు, పిచ్చి చెట్లు పెరిగి శ్మశాన వాటిక ఆనవాళ్లు లేకుండా పోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి వైకుంఠధామాన్ని వినియోగంలోకి తేవాలి.

- బొడ్డుపల్లి రాజేందర్, గ్రామస్తుడు, పెద్దకొర్పోలు

ఉన్నతాధికారులకు నివేదిస్తా..



మండలంలోని పలు వైకుంఠధామాలు నిరుపయోగంగా ఉన్నాయి. వసతుల లేమితో అటు వైపు ప్రజలు వెళ్లడం లేదు. ఎక్కడెక్కడ నిరుపయోగంగా ఉన్నాయో గుర్తిస్తాం.. వసతులు కల్పనకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

- ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ, నెక్కొండ

కస్తూర్బా పాఠశాలలో సేఫ్టీ సెక్యూరిటీ ఆడిట్



వంటసామగ్రిని పరిశీలిస్తున్న సరళ

నర్సంపేట: చెన్నారావుపేట మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలను మండల విద్యాశాఖ అధికారిని బైరి సరళ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆడిట్‌లో భాగంగా గురువారం సందర్శించారు. పాఠశాలలో స్టోర్ రూమ్, కిచెన్ షెడ్, తరగతి గదులను పరిశీలించారు. కస్తూరిభా పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలను ప్రచురించిన పుస్తకాలు 'కస్తూరి విజయము'ను విద్యార్థులకు అందజేశారు. పాఠశాల విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయులు షాహీన, రజిత, రజని, పల్లవి, రజని, స్వప్న పాల్గొన్నారు.

సిద్ధార్థ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలను ఎంఈఓ బైరి సరళ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. ప్రతి ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు. ఈ వేసవిలో అన్ని పాఠశాలలు ఒంటి పూట బడులు నిర్వహించాలని, ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించొద్దని సూచించారు. రెండు పూటల పాఠశాలలు నడిపిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని పాఠశాలలు ఫార్మేషన్, సమ్మేటివ్ పరీక్షల మార్కుల వివరాలను తొందరగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. యూడైస్ ఫార్మెట్‌ను ఎంఆర్సీ కార్యాలయంలో రేపటి వరకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ పాఠశాల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, వెంకటేశ్వర్లు, అనిల్, సీఆర్పీ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తిహవేలిలో నిమ్మకాయల శివ, రాయపురి ఎల్లయ్య, వనపర్తి చంద్రమౌళి, మనుగొండలో ఆర్‌ఎంపీ సారంగపాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో జిల్లా కాంగ్రెస్ నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున పంపించారు. ఈమొత్తాన్ని నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్ బాధిత కుటుంబాలకు గురువారం అందించారు. కార్యక్రమంలో బొడిగె శోభన్, ఇంద్రసేనారెడ్డి, శ్యాం, స్వామి, శ్రీను, కరుణాసాగర్, రాజ్‌కుమార్, కనకయ్య, కమలాకర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి మండలంలో..

రాయపర్తి: మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించినట్లు ఆ ఫౌండేషన్ అధికార ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి గురువారం తెలిపారు. మండలకేంద్రానికి చెందిన పిల్లి కృష్ణకాంత్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో చేయూతనందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పూస మధు, ఐత రాంచందర్, యాకయ్య, గురునాథం, ఉప్పలయ్య, సంపత్, యాకన్న, నాగరాజు, రాజు, భిక్షపతి, సతీష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో మృతిచెందిన బెల్లంకొండ సమ్మయ్య కుటుంబానికి సైతం సాయం అందించినట్లు తెలిపారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న కురుమ సంఘం నాయకులు

నర్సంపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నర్సంపేట డివిజన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నర్సంపేట కురుమ సంఘం డివిజన్ కమిటీ అధ్యక్షుడు బుడగొండ భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ గ్రామాల కురుమ కులస్తులు డోలు చప్పుళ్లతో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించారు. ముందుగా నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమ్మ కిరణ్, సంఘం ప్రధాన కార్యదర్శి కంకల రాజు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి: మండలంలోని తొగర్రాయి గ్రామంలో దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి సీపీఎం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, ఆవుల నర్సింహారెడ్డి, మొగిలి, యాకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం



గీసుకొండ: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, నగర మేయర్, కలెక్టర్ తదితరులు



నర్సంపేట: బియ్యం పంపిణీ చేస్తున్న శ్రీనివాస్



రాయపర్తి: పెర్కవేడులో..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ/ఖానాపురం/నల్లబెల్లి/ పర్వతగిరి/వర్ధన్నపేట/రాయపర్తి/దుగ్గొండి: పేదల ఆకలి తీర్చడానికే రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లలో నగర మేయర్ గుండు సుధారణి, కలెక్టర్ సత్యశారదతో కలిసి సన్నబియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. దీంతోపాటు జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో ఆయా మండలాల అధికారులు, స్థానిక నాయకులు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్ : భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శమని గురిజాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అర్పిత అన్నారు. కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని గురువారం పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా అర్పిత మాట్లాడుతూ.. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు, 9 విద్యార్థులు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం.. ఆతిథ్యాన్ని అందించారు. 6,7వ తరగతి విద్యార్థుల పోస్టర్ మేకింగ్ అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయుడు సతీష్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సాధత్, చంద్రకళ, రమేష్, రాజేష్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

బిట్స్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ఎక్స్‌లర్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ హరిహరన్ తెలిపారు. మొత్తం 215 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి రౌండ్ పూర్తయ్యే సరికి 62 మంది ఎంపికైనట్లు తెలిపారు. గ్రూప్ డిస్కర్షన్, హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించే సరికి 33మంది ఎంపిక కావడం జరిగిందని, వీరికి సంవత్సరానికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. బీటెక్ పూర్తికాగానే ఈ సంస్థ ఆధ్వర్యంలో కంపెనీలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను బిట్స్ చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, సురేష్, ఫసి అహ్మద్ ఫర్వేజ్, ఫణీంద్ర, రణదీరెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గాల ఎన్నిక, నియామకాలు

ఖానాపురం: మండల కేంద్రంలో పాకాల రైతుమిత్ర పరస్పర సహాయ సహకార సంఘం 20వ వార్షిక సభ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గులాంనభీ, ఉపాధ్యక్షుడిగా ఎడ్ల భిక్షంరెడ్డి, కోశాధికారిగా నర్సింహరావు, సభ్యులుగా వాసుదేవరెడ్డి, వల్లెపు శ్రీను, శ్రీనివాస్, మధుసూధన్‌రెడ్డి, వీరస్వామి, శ్రీను ఎన్నికయ్యారు. సమావేశంలో రమేష్, పోశెట్టి, లింగారెడ్డి, మస్తాన్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న రాజేందర్

గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తిహవేలికి చెందిన మంద రాజేందర్ జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల చైర్మన్‌గా నియమితులయ్యారు. గురువారం ఆ కమిటీ జిల్లా చైర్మన్ గంగుల అశోక్ నియామక ఉత్తర్వులను రాజేందర్‌కు అందించారు.

మాదిగ జేఏసీ ఎన్నిక

నర్సంపేట: మాదిగ జేఏసీ చెన్నారావుపేట మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మెట యాదగిరి, ఉపాధ్యక్షుడు కొయ్యల భాస్కర్, మంద విజయ్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మాదిగ జేఏసీ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మంద చిన్ను, ములుగూరి స్వామి, ఉపాధ్యక్షుడిగా రాజేందర్, సహాయ కార్యదర్శిగా ఎర్ర సాగర్ తోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కమిటీ ఎన్నిక..



సంతోష్‌కుమార్

నెక్కొండ: మండలంలోని పత్తిపాక శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ గౌరవ చైర్మన్ పసునూటి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ చైర్మన్‌గా పసునూటి సంతోష్‌కుమార్, వైస్ చైర్మన్‌గా చిన్న తిరుమల్, ప్రధాన కార్యదర్శిగా బోడ లక్ష్మణ్, కోశాధికారిగా ఉసిల్లపాటి సురేశ్, సహాయ కార్యదర్శులుగా బాదావతు సునీల్, గట్ల వెంకటేశ్వర్లు, సభ్యులుగా బొల్లెబోయిన పరుశురాములు, దొమ్మటి యాకయ్య, ఈదునూరి రఘుపతి, మాదారపు వీరస్వామి, తదితరులు ఎన్నికయ్యారని తెలిపారు.

ఐసీడీఎస్ సేవలు వినియోగించుకోవాలి

నల్లబెల్లి: ఐసీడీఎస్ సేవలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని నల్లబెల్లి క్లస్టర్ సూపర్‌వైజర్ అరుణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రీస్కూల్ పిల్లలను ఉదయం 8 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఒక పూట భోజనంతోపాటు 200 ఎంఎల్ పాలు, ఒక గుడ్డును అందిస్తున్నట్లు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మార్చి నెల నుంచి మూడు దఫాలుగా గుడ్లు సరఫరా చేస్తామన్నారు. 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లల తల్లిదండ్రులు క్రమంతప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ఎఫ్‌ఆర్‌ఎస్ చేసుకుని గుడ్లు, బాలామృతం తీసుకోవాలని కోరారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న నాగార్జునరెడ్డి, తదితరులు

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్ గ్రామంలోని శ్రీసాయి విద్యాలయానికి చెందిన విద్యార్థి భూక్య తిరుపతి.. నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్ల నాగార్జునరెడ్డి గురువారం తిరుపతిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీసాయి విద్యాలయం కరస్పాండెంట్, గడ్డం వెంకటేశ్వర్లు, కోడూరు అశోక్‌కుమార్, ఎర్రబెల్లి హరికుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్సై మహేందర్

నెక్కొండ: మండలానికి చెందిన 14 మంది పోగొట్టుకున్న సెల్ ఫోన్లను రికవరీ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులకు ఎస్సై మహేందర్ గురువారం అందించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో సెల్‌ఫోన్లు పోయిన బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి గుర్తించినట్లు తెలిపారు. పోన్లు ట్రేస్ చేయడంలో ప్రతిభకనబర్చిన వీపీసీ మంజుల, పీసీ రనేశ్‌లను ఎస్సై అభినందించారు. ఫోన్ పోగొట్టుకున్న తక్షణమే పోలీసులను ఆశ్రయించడంతో తిరిగి ఫోన్ పొందడం సంతోషంగా ఉందని బాధితులు తెలిపారు.

సెంట్రల్ యూనివర్సిటీ భూములు విక్రయించొద్దు



పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నర్సంపేట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు విక్రయించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి యూనియన్ నాయకుల మీద పోలీసుల నిర్బంధాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈసంపెల్లి బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల రక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి నాయకులు, సీపీఎం నాయకులను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాలు, నాయకులపై నిర్బంధం పెరిగిందని విమర్శించారు. విశ్వ విద్యాలయాలు, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన దశలో ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజాస్వామ్యం పునరుద్దరణ తన ఏడవ గ్యారంటీగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత అప్రజాస్వామికంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొరబోయిన కుమారస్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, నాయకులు బాలకృష్ణ, రాజు, సతీష్, ఆంజనేయులు, సంజీవ, అనిల్, విజయ, స్వప్న, నాగమణి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. చెన్నారావుపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పరికి మధుకర్ మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల రక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 400ఎకరాల భూమి అమ్మకం ప్రయత్నాలను విరమించాలని, విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో విద్యార్థుల ప్రతిభ

వర్ధన్నపేట: ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్‌లో ఒలంపియాడ్(ఐఎన్‌టీఎస్ఓ)లో వర్ధన్నపేట పట్టణంలోని శ్రీఅరబిందో ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల చైర్మన్ శ్రీధర్ గురువారం తెలిపారు. ఫిబ్రవరిలో నిర్వహించిన టాలెంట్ పరీక్షల్లో పాఠశాల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొనగా 72 మంది మంచి ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఇందులో 8వ తరగతి చదువుతున్న సాయి చరణ్ ప్రథమ బహుమతిగా ట్యాబ్ అందుకున్నట్లు తెలిపారు. 33 మంది విద్యార్థులు బంగారు పథకాలు సాధించారన్నారు. 25 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నట్లు వెల్లడించారు. గురువారం పాఠశాల చైర్మన్ శ్రీధర్, కోఆర్డినేటర్ శివకోటేశ్వర్, ప్రిన్సిపాల్ దిలీప్‌సింగ్, డీన్ వీరన్న ఉపాధ్యాయ బృందం.. విద్యార్థులను అభినందించారు.